క్లుప్తంగా

కాంగ్రెస్ ప్రచార కార్యదర్శిగా సకినాల రాజు

మహాముత్తారం: మండల కాంగ్రెస్ ప్రచార కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన సకినాల రాజును నియమించినట్లు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. అదవిధంగా వచ్చే ఎన్నికల్లో శ్రీధర్‌బాబు గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు.

కేసు నమోదు

మహాముత్తారం : మండల కేంద్రంలోని నేత కానిపల్లికి చెందిన జోడి సురేష్‌ను అదే గ్రామానికి చెందిన కొండ అరవింద్, విష్ణు శనివారం రాత్రి కత్తితో దాడి చేసినట్లు సురేష్ తండ్రి జోడి చిన్నయ్య ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇద్దరు వ్యక్తులతో పాటు దాడికి సహకరించిన అదే గ్రామానికి చెందిన మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: మండలంలోని రాంచంద్రాపూర్‌కు చెందిన ఆకుల రాంబాబు(38) ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాంచంద్రాపూర్‌కు చెందిన రాంబాబు, అదే గ్రామానికి చెందిన గాజె సురేష్‌తో కలిసి గత ఐదు రోజుల క్రితం తన వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై పరకాలకు వెళ్లి వస్తుండగా తిర్మలాపూర్ వద్ద అదుపుతప్పింది. దీంతో వాహనంపై వెనుకాల కూర్చున్న రాంబాబుకు తలకు తీవ్రగాయం కావడంతో అతనిని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

మద్దపల్లిలో..

రేగొండ : విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మద్దపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గొలుసుల శ్రీనివాస్ (25) వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్న క్రమంలో రాజిరెడ్డి తన ఇంట్లో విద్యుత్ సరఫరా కొనసాగడం లేదని విద్యుత్ స్తంభం ఎక్కి సరిచేయమని కోరాడు. విద్యుత్ అధికారులకు సమాచారం అందించి ఎల్‌సి తీసుకోవాలని కోరగా నేను ఇప్పటికే ఎల్‌సీ తీసుకున్నాను నువ్వు స్తంభం ఎక్కి విద్యుత్ వైరును సరిచేయమని కోరగా నమ్మకంగా స్తంభం ఎక్కిన వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై స్తంభం పైనుంచి కింద పడగా తీవ్ర గాయలపాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం పరకాలలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి

టేకుమట్ల: ఎన్నికల ప్రవర్తన నియమావళి సందర్భంగా ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఎస్సై సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలకు, ఇతరులపై అసత్య ప్రచారాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని రామకిష్టాపూర్(వి)కు చెందిన ఏడుగురు పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ చేసారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



కాళేశ్వరం: వీధి కుక్కల దాడిలో ఓ బాలుడు గాయపడ్డ సంఘటన మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో ఆదివారం చోటు చేసుకుంది. దీక్షిత్ ఇంట్లో ఆడుకుంటున్న సమయంలో వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో బాలుడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తల్లి మమత అతన్ని మహాదేవపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీ

చిట్యాల: స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్ద సీఐ వేణుచందర్ సిబ్బందితో కలిసి ఆదివారం పలు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పరిశీలించినట్లు చెప్పారు. ఎవరైనా నగదు, మద్యం అక్రమంగా రవాణా చేస్తే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. లేనియెడల చర్యలు తప్పవన్నారు. దాడుల్లో వెంట ఎస్సై ఎండీ.శాఖాన్, కానిస్టేబుళ్లు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు



భూపాలపల్లి రూరల్ : గుడాడ్‌పల్లిలో బతుకమ్మ పేరుస్తున్న జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ శోభ



చిట్యాల : గోపాలపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మల్హర్ : తాడిచర్ల చీటిపల్లిలో బతుకమ్మ ఆడుతున్న యువతులు, మహిళలు



రేగొండ: ఆరు గ్యారంటీలతో బతుకమ్మ

సద్దుల బతుకమ్మ సంబురాలను మహిళలు, పిల్లలు, వృద్ధులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే తలంటూ స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి బతుకమ్మను అందంగా పేర్చుకున్నారు. సాయంత్రం వేళలో ప్రధాన కూడళ్లలో, ఆలయాల్లో పరిసర ప్రాంతాలకు చేరుకుని బతుకమ్మలను ఒకే చోట పేర్చి బతుకమ్మ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం చెరువుల వద్ద నిమజ్జనం చేశారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



భూపాలపల్లిలో బతుకమ్మలతో మహిళలు



కొర్కటంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కొత్తపల్లి(గోరి)లో బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు, పిల్లలు



టేకుమట్ల : బతుకమ్మలను ఎత్తుకున్న సర్పంచ్, ఎంపీటీసీలు



ఎంపేడులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



టేకుమట్ల : బతుకమ్మలతో యువతులు...



మొగుళ్లపల్లి : బతుకమ్మతో మహిళ..



చిట్యాలలో...



మొగుళ్లపల్లి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు..



మొగుళ్లపల్లి : గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మలు...



చిట్యాలలో..



చిట్యాల : బావుసింగ్‌పల్లిలో ...



కాటారం : బతుకమ్మఆడుతున్న మహిళలు



రేగొండ: కోటంచలో



టేకుమట్లలో..



రేగొండలో..



బతుకమ్మతో మహిళలు ..



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు



నిమజ్జనం చేస్తూ..

పార్టీ మారానని వస్తున్న వార్తలు అవాస్తవం

మహాముత్తారం : రెండు రోజుల నుంచి నేను కాంగ్రెస్ పార్టీ మారుతున్నానని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తమని రేగులగూడెం సర్పంచ్ బూసిదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఉంటూ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు నడుచుకుంటానని వచ్చే ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కొంత మంది అధికార పార్టీ నాయకులు నాపై కావాలనే పాత ఫొటోలను సోషల్‌మీడియాలో వైరల్ చేస్తున్నారని అన్నారు. ఇలాంటి ప్రచారాలు ఎవరూ నమ్మవద్దని కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.



మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

ఉపాధి కోసం సమష్టిగా ఉద్యమించాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లాఖాద్రీ...

భూపాలపల్లి రూరల్ : యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం సమష్టిగా ఉద్యమించాలని అఖిలభారత యవజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక కొమురయ్య భవన్‌లో ఏవైఎఫ్ఎస్ఐ జిల్లా రెండో మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం యువత ఉపాధి కల్పనపై దృష్టి సారించలేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో అక్టోబరు 29, 30 తేదీల్లో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఆరబోయిన వెంకటేష్, వేముల శ్రీకాంత్‌తో పాటు 21 మందితోని కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. మహాసభలో సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి క్యాతారాజు సతీష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, నాయకులు భగత్, రమేష్ చారి, ప్రేమ్ కుమార్, అరుణ్ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రి

ఎన్‌సీసీ శిబిరానికి విద్యార్థుల ఎంపిక

మొగుళ్లపల్లి: సికింద్రాబాద్‌లో నవంబర్ ఒకటి వరకు జరుగనున్న ఎన్‌సీసీ జాతీయ సమైక్యత ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ శిక్షణ శిబిరానికి మొట్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న విద్యార్థులు గంట ఆకాష్, కొత్తూరి అక్షిత, గూడెపు కార్తీక్, కొండ శ్రీనిధి, జన్నే ఇందులు ఎంపికైనట్లు ఎన్‌సీసీ అధికారి గుండెల్లి రాజయ్య తెలిపారు. ఈ శిబిరంలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఎల్. కుమారస్వామి, సర్పంచ్, ఎంపీటీసీ, ఉపసర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్, గ్రామస్తులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు...

ఈటలకు స్వాగతం పలికిన బీజేపీ శ్రేణులు

కాటారం: మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్ పరిశీలనకు వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ప్రధాన కూడలిలో ఈటలను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఈటలకు సన్మానం చేస్తున్న బీజేపీ శ్రేణులు

మహాగౌరీ దేవి అలంకరణలో అమ్మవారు

కాళేశ్వరం: శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవిశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా 8 రోజు శ్రీశుభానంద దేవి, శ్రీమాహా సరస్వతి అమ్మవార్లు ఆదివారం మహాగౌరి అమ్మవార్లుగా భక్తులకు దర్శనమిచ్చారు.



కాళేశ్వరం : మహాగౌరీ దేవిగా అమ్మవారు

ఆలయం మూసివేత

కాళేశ్వరం: చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 28 మధ్యాహ్నం 2 గంటల నుంచి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో ప్రధానాలయంతో పాటు అనుబంధ దేవాలయాలు అన్ని ద్వార బంధనం చేసి భక్తుల దర్శనాలు, పూజలు నిలిపి వేయనున్నట్లు ఈఓ మహేష్ ఆదివారం ఓక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరిగి ఈనెల 29 ఆదివారం రోజున ఉదయం 4.30 గంటలకు దేవాలయాల ద్వారాలు తెరిచి ఆలయాల పరిశుభ్రత, సంప్రోక్షణ, పాత:కాల పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులకు దర్శనాలు, ఆర్జిత సేవలు చేసుకోనుటకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. అలాగే 28న చంద్ర గ్రహణం ఏర్పడటం వలన ప్రతి పౌర్ణమి రోజున నిర్వహించే గోదావరి నదీ హారతి, కోజాగర పౌర్ణమి ప్రత్యేక పూజ కార్యక్రమాలు రద్దు చేయనున్నట్లు చెప్పారు.